క్లుప్తంగా

సర్వపాప హరణం వేంకటాచల మహత్యం


వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితుడు యాతగిరి మధ్వేష్

బోట్‌క్లబ్: వేంకటాచల మహత్యాన్ని ఎవరు శ్రవణం చేస్తారో వారికి సర్వపాపాల నుంచి ఉపశమనం కలగడమే కాక భగవంతునికి అనుగ్రహం తప్పక లభిస్తుందని పురాణ ఇతిహాస గ్రంథాల ద్వారా మనకు అవగతమవుతున్నాయని యాతగిరి మధ్వేష్ అన్నారు. శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా పదిరోజులుగా స్థానిక రమాసహిత సత్యదేవ మందిరంలో నిర్వహిస్తున్న వేంకటాచల మహత్య ప్రవచనాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీ, భూ సమేత శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. తిరుమల గిరుల విశేషంతో పాటు వైకుంఠం నుంచి విష్ణుమూర్తి భూలోక ఆగమనానికి గల విశేషాలను వివరించారు. కాకినాడ మధ్వసభ కమిటీ అధ్యక్షులు రాచూరి రాఘవేంద్రస్వామి, ఉపాధ్యక్షులు తాడూరి రంగారావు, కార్యవర్గ సభ్యులు జాగిర్దార్ ప్రేమ్‌కుమార్, సంగీత విద్యాంసురాలు మనోజ్ఞ పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు


ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

కరప: గ్రామ దేవత ఉప్పాలమ్మ తల్లి ఆలయంలో శనివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. వేదపండితులు మాచర పురుషోత్తమశర్మ, విలపర్తి సత్యకృష్ణ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కరప, పరిసర గ్రామాల నుంచి 150 మంది మహిళలు ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. భక్తులకు దాతలు మేడసాని వీరభద్రరావు, సీతామహాలక్ష్మి అన్నప్రసాద వితరణ చేశారు.

ఎస్సీ నాయకుడు నూకరాజుకు నివాళులు


నూకరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కరప: మండల ఎస్సీ నాయకుడు, అంబేడ్కరిస్ట్ రొక్కాల నూకరాజు(వాకాడ) మృతి తీరని లోటని ఎస్సీ నాయకులు అన్నారు. మండల అంబేడ్కర్ యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో శనివారం కరప పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నూకరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. మండల అంబేడ్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు చిన్నం వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ బుంగా సింహాద్రి, మాజీ సర్పంచ్ మారెళ్ల వెంకటరమణ, మండల ఎస్సీ నాయకులు బీర మాలయ్య, ఊబా ఏడుకొండలు, సాదే లోహిదాస్, దాలిపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీడీలకు ఆర్జేడీ అభినందన


పీడీలను అభినందిస్తున్న ఆర్జేడీ నాగమణిదేవి తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): న్యూఢిల్లీలో ఈనెల 16 నుంచి 19 వరకు జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడల్లో ఖోఖోలో ఆంధ్రప్రదేశ్ జట్టు రజత పతకం సాధించిందని ఖోఖో సంఘ కార్యదర్శి పట్టాభి శనివారం తెలిపారు. ఈ ఘనతలో ప్రధాన పాత్ర పోషించిన జిల్లా క్రీడాకారులు ఎండీ ఇబ్రహీం(పీడీ వేట్లపాలెం), ఎస్.కిరణ్‌కుమార్ (పీడీ ఏపీఎస్పీ) శనివారం ఆర్జేడీ స్కూల్ ఎడ్యుకేషన్ నాగమణిదేవిని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆమె క్రీడాకారులకు అభినందించారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు రవిరాజు, హెచ్‌ఎం రంగారావు, వాకలపూడి పీడీ పి.శ్రీనివాస్, ఖోఖో సంఘ జిల్లా కార్యదర్శి పట్టాభి తదితరులు పాల్గొన్నారు.


తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ నిలిపే స్థలాల్లో పార్క్ చేసిన వాహనాలు


ద్విచక్రవాహనాలతో కిక్కిరిసిన కోరమండల్ తాగునీటి ప్లాంటు ఆవరణ


నిషేధిత స్థలం నుంచి వాహనాలు తీయిస్తున్న సెక్యూరిటీ గార్డు


నిషేధిత స్థలంలో పార్కింగ్.

జీజీహెచ్‌లో ట్రాఫిక్ టెర్రర్

- అస్తవ్యస్తంగా వాహనాల నిలిపివేత
- ప్రశాంతతను భంగపరుస్తూ హారన్ల మోత
- నియంత్రణకు పాస్‌లు జారీకి యోచన

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో పార్కింగ్ నిర్వహణ కత్తిమీద సాములా మారింది. నానాటికీ పెరుగుతున్న వాహనాల సంఖ్య ఈ స్థితికి కారణమవుతోంది. ఉన్నంతలో చర్యలు చేపడుతున్నా ఫలితం కనిపించడం లేదు. సోమవారాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. ఆసుపత్రిలో ఇప్పటికే కేటాయించిన పార్కింగ్ స్థలాలేవీ రద్దీని తాళలేకపోతున్నాయి. స్థలాల లేమి, అస్తవ్యస్త పార్కింగులతో వాయువేగంతో వార్డుల వద్దకు వెళ్లాల్సిన అంబులెన్సులు నానా అవస్థలు పడుతున్నాయి.

వాహనాల రద్దీతో గందరగోళం

కేవలం రోగుల వాహనాలే అయితే పరవాలేదు. కానీ రోగుల బంధువుల వాహనాలు అధిక సంఖ్యలో ఉండడం గమనార్హం. జీజీహెచ్‌లో గడిచిన నెల రోజుల్లో సరాసరి పార్కింగ్ వాహనాలు 1150. వీటిలో అధిక శాతం వారివే. మిగిలినవి అత్యవసర వాహనాలు, సిబ్బందివీ. నిర్దేశిత ప్రాంతాల్లో క్రమ పద్ధతిలో కాకుండా అస్తవ్యస్తంగా నిలపడమే కాక, ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తూ హోరున హారన్లతో ఇబ్బంది కలిగిస్తున్నారు.

15 చోట్ల పార్కింగ్

జీజీహెచ్‌లో కాన్సర్ వార్డు ఎదురుగా, ఓపీ ప్రాంగణం, మెడికల్ వార్డులను ఆనుకొని, సుభోజనం ప్రాంగణం, సర్జికల్ భవంతి ఆవరణ, స్టోర్స్ ఎదురుగా, ఆక్సిజన్ ప్లాంటు ఆవరణ, అంబానీ ల్యాబ్ ప్రాంగణం, నర్సింగ్ కాలేజ్ పక్కన, ఎంసీహెచ్ బ్లాక్ ఎదురుగా, వన్ స్టాప్ సెంటర్ ఎదురుగా, ఏడో నంబరు ల్యాబ్ ప్రాంగణం, క్యాంటీన్ ప్రాంతం, ఎస్ఆర్ఎంటీ ప్రాంతం, ఈఎన్‌టీ భవంతి ఆవరణ, ఐడీ వార్డు సమీపం, ఫిజియోథెరపీ ఆవరణ... ఇలా మొత్తం 17 చోట్ల వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు ఉన్నాయి. ఓపీ వేళల్లో ఇవన్నీ వాహనాలతో కిటకిటలాడుతుంటాయి. పోనీ బయట పార్కింగ్ చేయాలంటే చోరీల భయం ఒకటి.


జీజీహెచ్‌లో స్థలాభావం వల్ల రోడ్డుపై నిలిపిన ద్విచక్రవాహనాలు

విస్తరించే యోచన

ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆసుపత్రిలో పార్కింగ్ స్థలాలు విస్తరించే దిశగా యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తాత్కాలిక, అవకాశాన్ని బట్టి శాశ్వత పార్కింగ్ స్థలాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని అధికారుల సమావేశం తీర్మానించింది. కొన్నేళ్ల క్రితం ఆసుపత్రిలో అంతర్భాగమైన టీబీ కార్యాలయాన్ని డీఎంహెచ్‌వో లేదా మరో అనుకూల ప్రాంతాలనికి తరలించే ప్రణాళిక ఉంది. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో అది ఖాళీ అయితే ఆ స్థలాన్ని తాత్కాలిక పార్కింగ్‌కు వినియోగించే అవకాశం ఉంది. అదే జరిగితే కనీసం 800 ద్విచక్ర వాహనాలు పార్క్ చేయవచ్చు.

పాస్‌ల పునరుద్ధరణకు చర్యలు

గతంలో డాక్టర్ బుద్ధా సూపరింటెండెంట్‌గా ఉన్న కాలంలో జీజీహెచ్‌లో వాహనాల రద్దీ నియంత్రణకు లోపలకు వచ్చే వాహనాలకు పాస్‌లు కేటాయించాలని ప్రతిపాదించారు. ఇప్పుడు ఈ అంశం తాజాగా తెరపైకి వచ్చింది.

తగిన చర్యలతో పరిష్కారం



జీజీహెచ్‌లో వాహనాల పార్కింగ్ ఇబ్బందిగా ఉంది. పాస్‌ల కేటాయింపు, సిబ్బంది, వైద్యులు, అధికారులకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు, షెడ్‌లు ఇప్పటికే కొనసాగుతున్నాయి. తగిన చర్యలతో ఆసుపత్రిలో పార్కింగ్ సమస్యను పరిష్కరిస్తాం.

– డాక్టర్ లావణ్యకుమారి, సూపరింటెండెంట్, జీజీహెచ్

ఆలయాల మూసివేత


మూతపడ్డ సీతారామాలయం

బోట్‌క్లబ్: రాహుగ్రస్త చంద్రగ్రహణం వల్ల శనివారం సాయంత్రం నగరంలోని పలు ఆలయాలు మూసివేశారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని మూసివేయనున్నట్లు ఈవో చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంప్రోక్షణ అనంతరం ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ఆలయం తెరవనున్నట్టు ఆయన తెలిపారు. స్థానిక దేవాలయంవీధిలోని బాలాత్రిపురసుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయం, వేణుగోపాలస్వామి దేవస్థానం, మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి దేవస్థానం, భానుగుడి భానులింగేశ్వరస్వామి దేవస్థానం, గాంధీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంతో పాటు నగరంలో పలు ఆలయాలను శనివారం సాయంత్రం నుంచి మూసివేశారు.

భావనారాయణ ఆలయం మూసివేత


భావనారాయణ ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు

కాకినాడ రూరల్: చంద్రగ్రహణం సందర్భంగా సర్పవరం భావనారాయణ స్వామి ఆలయాన్ని అర్చకస్వాములు మూసివేశారు. తిరిగి సంప్రోక్షణ అనంతరం ఆదివారం ఉదయం ఐదు గంటలకు ఆలయాన్ని తెరవనున్నట్టు ఈవో భీమశంకర రావు, చైర్మన్ నారాయణరావు తెలిపారు.

కన్నబాబుకు అండగా ఉంటాం


ఎమ్మెల్యే కన్నబాబును గజమాలతో సత్కరిస్తున్న శెట్టిబలిజ సంఘ నేతలు

- నినదించిన శెట్టిబలిజ నేతలు
- వైఎస్సార్ సీపీని గెలిపిస్తామని ప్రకటన
- ఎమ్మెల్యేకు గజమాలతో సత్కారం

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు అండగా ఉంటామని శెట్టిబలిజ సంఘ నేతలు ప్రకటించారు. తమ అభ్యున్నతి కోసం సామాజిక భవనాలను నిర్మిస్తూ కన్నబాబు తమ కులస్తులకు పెద్ద పీట వేశారని వారు పేర్కొన్నారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో కన్నబాబును శనివారం రాత్రి కలసి గజమాలతో సత్కరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ, కన్నబాబు విజయం కోసం శ్రమిస్తామని నేతలు యనమదల రవి, రాయుడు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, వాసంశెట్టి త్రిమూర్తులు, కండిపల్లి వెంకటరమణ, మాచవరపు సత్యనారాయణ, కొప్పిశెట్టి చంద్రమౌళి, అనుసూరి సతీష్, గుత్తుల శ్రీనివాస్, పెంకే రాజు తదితరులు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యున్నతికి పెద్దపీట వేశారన్నారు. నియోజకవర్గంలో కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు పెద్ద పీట వేశామన్నారు. శెట్టిబలిజ కులస్తులకు ఇటీవలే రాయుడుపాలెం, సర్పవరంలలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, పలు చోట్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. చీడిగ, తదితర చోట్ల ప్రారంభోత్సవాలు చేశామన్నారు. శెట్టిబలిజలకు పార్టీ పరంగాను, స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్ద పీట వేశామన్నారు. పెద్ద ఎత్తున కలసి మద్దతుగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలియజేసి, ఏ అవసరం ఉన్నా తన వద్దకు రావాలని కోరారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఐడియల్ విద్యార్థిని

బాలాజీచెరువు: స్థానిక ఐడియల్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ టి.అపరాంజిత ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైందని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ సమాజ సేవ ద్వారా వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో జాతీయ సేవా పథకం ప్రారంభమైందన్నారు. ఢిల్లీలో నిర్వహించే ప్రతిష్టాత్మక గణతంత్ర దినోత్సవం రోజున నిర్వహించే పరేడ్‌లో అపరాంజిత ఎంపిక కావడం మనకు, మన కళాశాలకు, మన పట్టణానికి గర్వ కారణమన్నారు. నారీ శక్తి నినాదంతో జరిగే 2024 రిపబ్లిక్ డే పరేడ్ చాలా ప్రత్యేకమైనదని తెలియజేశారు. ఇందులో భాగంగా గత నెల 13న ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరిగిన ఎంపిక కార్యక్రమంలో ఆమె ఉండటం గర్వనీయమని పేర్కొన్నారు. వీరికి నవంబర్ 1 నుండి పదో తేదీ వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థి అపరాంజితను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వైఆర్ఎల్ చౌదరి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.స్టీవెన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినిని అభినందిస్తున్న డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి, ఐడియల్ కళాశాల అధ్యాపకులు

బాలయోగి భవనం ఆధునీకరణకు కృషి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి


ఎమ్మెల్యే ద్వారంపూడిని సత్కరిస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

కాకినాడ: బాలాజీచెరువు సెంటర్ సమీపంలోని అంబేడ్కర్ హాస్టల్ ఆవరణలో ఉన్న జీఎంసీ బాలయోగి భవనం ఆధునీకరణకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. అంబేడ్కరిస్ట్ పిల్లి రామారావు ఆధ్వర్యంలో దళిత సంఘాల నేతలు శనివారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. దళిత సంఘాల విజ్ఞప్తి మేరకు అంబేడ్కర్ హాస్టల్ నిర్మాణానికి ఎమ్మెల్యే ద్వారంపూడి ఇటీవల తన గ్రాంటు నుంచి రూ.50 లక్షలు, ఎంపీ నిధులు రూ.45 లక్షలు మంజూరు చేయడంపై ధన్యవాదాలు తెలిపి ఎమ్మెల్యేను సత్కరించారు. దళిత సంఘాల ప్రతినిధులు అయితాబత్తుల రామేశ్వరరావు, నక్కా రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్వకేట్ మృతికి సంతాపం

కాకినాడ క్రైం: సీనియర్ క్రిమినల్ అడ్వకేట్ డీవీఆర్‌కే రవీంద్రప్రసాద్ మృతికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సంతాపం తెలిపారు. శనివారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన సంతాప సభకు ఆయన హాజరయ్యారు. రవీంద్రప్రసాద్ ఏపీ ఎన్జీవో మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మమీనాక్షి భర్త. ఆమెతో పాటు, కుమారుడు సిద్వీచందన్‌కు ఎమ్మెల్యే సంతాపం తెలిపారు. ఏపీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, ఏడిద సర్పంచ్, జిల్లా మాజీ అధ్యక్షుడు బూరిగ ఆశీర్వాదం, మాజీ డీఎంఈ డాక్టర్ రాఘవేంద్రరావు తదితరులు హాజరయ్యారు.

పోలీసు అమరులకు నివాళిగా..

కాకినాడ క్రైం: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కాకినాడలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ కల్యాణ మండపంలో పోలీసులు, ఆటో డ్రైవర్లతో పాటు సాధారణ పౌరులు రక్తదానం చేశారు. జిల్లా పోలీస్ శాఖ, శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్పీ రక్తదానం చేశారు. 200 మంది రక్తదానం చేశారని ఆయన తెలిపారు. తలసేమియా బాధితులకు ఈ రక్తం అందనుందని అన్నారు. శ్రీ యువసేన వ్యవస్థాపకుడు బొల్లం సతీష్, అదనపు ఎస్పీలు శ్రీనివాస్, సత్యనారాయణ, డీఎస్పీలు మురళీకృష్ణ, జయరాం ప్రసాద్, వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు...

వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో పోలీస్ శాఖ, కళాశాల యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. లైంగిక వేధింపుల నుంచి మహిళలు, పిల్లల రక్షణ, సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ నేరాలు అరికట్టడంలో సాంకేతికత పాత్రపై ఈ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు, పాల్గొన్నవారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఏఎస్పీ శ్రీనివాస్ తన బృందంతో కలసి పోటీలను పర్యవేక్షించారు. కళాశాల డైరెక్టర్ నాయుడుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.


రక్తదానం చేస్తున్న పోలీసులు

ఏపీఎస్పీ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: మూడో బెటాలియన్ ఏపీఎస్పీ క్యాంప్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని కమాండెంట్ సీహెచ్ విజయరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. శిబిరంలో 67 మంది పోలీస్ సిబ్బంది, అరబిందో ఫార్మసీ కంపెనీ నుంచి 15 మంది, ఇంగ్లిష్ మీడియం స్కూల్ టీచర్, పెట్రోల్ బంక్ సేల్స్‌బాయ్స్ మొత్తం 86 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సీహెచ్ భద్రయ్య, అడిషనల్ డీసీపీ ఎల్.అర్జున్, అసిస్టెంట్ కమాండెంట్ పి.సత్యం, ఆర్ఐలు సురేష్‌బాబు, రాము, గణేష్, రవిశంకర్, శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ శ్రీనివాస్

వాల్మీకి జీవితం స్ఫూర్తిదాయకం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): రామాయణ మహాకావ్యాన్ని ఈ సమాజానికి అందించిన వాల్మీకి మహర్షి అందరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా మాజీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి నివాళులర్పించారు. హిందూ ధర్మాలు, చరిత్ర, సంస్కృతి, నడవడిక, ఆచారాలు వంటి అంశాలు రామాయణ మహాకావ్యం మానవులపై అనితరమైన ప్రభావం చూపుతోందన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పరిపాలన ప్రారంభించిన నాటి నుంచి దేశ చరిత్రతో సంబంధం ఉన్న పెద్దలు, దేశం కోసం తన త్యాగం చేసి అమూల్యమైన సేవలందించిన మరెందరో మహానుభావుల కీర్తి ప్రతిష్ఠతలు, వారి జీవిత విశేషాలు నేటి తరానికి తెలియజేసేందుకు వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వాల్మీకి మహర్షి జయంతిని అధికారులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు మాట్లాడుతూ కుటుంబ విలువలను, తండ్రి మాటపై కొడుకు బాధ్యత, అన్నదమ్ముల అనుబంధం తెలియజేసేలా రామాయణ ఇతివృత్తాన్ని అందించిన మహనీయుడు వాల్మీకిమహర్షి అని శ్లాఘించారు. వలసపాకల సర్పంచ్ వాసంశెట్టి రామారావు, ఎంపీడీఓ కె.అప్పారావు, ఏఓ గుత్తుల భీమశంకరరావు, వీవీఎస్ వీరేష్, టి.సురేష్, జీవీ చినరాయుడు, టి.రాజేందర్, ఎం.గోపి తదితరులు పాల్గొన్నారు.


వాల్మీకి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

కరప: మండల పరిధిలో ఆర్బీకేల ద్వారా ఈ–క్రాప్ నమోదు చేసిన జాబితా విడుదల చేశామని, ఎవరిదైనా నమోదు కాకపోతే వెంటనే రైతులు దరఖాస్తు చేసుకుంటే సవరిస్తామని ఎంఏఓ ఏవీ రాజేష్ సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనివారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్బీకే వీఏఏ ప్రశాంత్ మాట్లాడుతూ సర్వే నంబర్ల వారీగా రైతుల పేరున ఎంత విస్తీర్ణం ఉంది, వారి పేర్లు, పంట వివరం, ఆధార్ నంబర్లతో ఈ–క్రాప్ నమోదు చేసినట్టు తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో ఉంచిన ఈ–క్రాప్ జాబితాలో రైతులు తమపేర్లు ఉన్నదీ, లేనిదీ తనిఖీ చేసుకోవాలని ఆయన సూచించారు. ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే గ్రీవెన్స్ చేసుకోవాలని వీఏఏ ప్రశాంత్ కోరారు. ఈ సందర్భంగా ఈ–క్రాప్ నమోదైన పత్రాలను రైతులకు అందజేశారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నక్కా వీరభద్రరావు, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, మద్దూరి భాస్కర్, రెడ్డి వీరభద్రరావు, వీఆర్వో కేఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపలో ఈ-క్రాప్ నమోదుపై రైతులకు సూచనలిస్తున్న అధికారులు


విలేకరులతో మాట్లాడుతున్న కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాపు నాయకులు

చంద్రబాబు వచ్చాకే కులాల చిచ్చు

- 'అంబటి' పై దాడి హేయమైన చర్య
- ఇలాగే కొనసాగితే ప్రతిఘటన తప్పదు
- ఆ సామాజిక వర్గానికి కాపుల అల్టిమేటం

కాకినాడ: నీటిపారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబుపై మాజీ సీఎం చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు దాడిచేసిన తీరు హేయమైన చర్య అని కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పలువురు కాపు నాయకులు పేర్కొన్నారు. స్థానికంగా శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అధికారంలోకి వచ్చాకే కులాల మధ్య చిచ్చురేగిందన్నారు. ఒకప్పుడు వంగవీటి రంగాను పొట్టన పెట్టుకుని ఇప్పుడు కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంపైనా, తాజాగా మంత్రి అంబటి రాంబాబుపై జరిగిన దాడి కాపులపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. అందరినీ ఆదరించే కాపు సామాజిక వర్గంపై దాడిచేస్తే అదే స్థాయిలో ప్రతిఘటించగలిగే సత్తా ఉందని హెచ్చరించారు. అవినీతి కేసులో చంద్రబాబు జైలుకు వెళ్ళారని, 'బాబు' అక్రమాలను తనదైన వాగ్దాటితో బయటపెడుతున్నారనే అక్కసుతోనే అంబటిపై దాడికి దిగారన్నారు. కాపు నాయకులు కంపర బాబి, వాసిరెడ్డి బుజ్జి మాట్లాడుతూ ఆ సామాజిక వర్గం వ్యవహారశైలిపై ఎంతో సంయమనం పాటిస్తున్నామని, రెచ్చగొడితే అంతకన్నా ధీటుగా స్పందిస్తామని హెచ్చరించారు. 2024లో చంద్రబాబును ప్రజాక్షేత్రం నుంచి తరిమికొట్టిన తరువాతే ఆంధ్రప్రదేశ్‌లో అన్ని సామాజికవర్గాలు గతంలోలా ఐక్యంగా ఉండగలవన్నారు. మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ బెండా విష్ణు, మాజీ డైరెక్టర్లు కొంతం శ్రీనివాస్, కర్రి అనంతలక్ష్మి మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారమే అంబటిపై దాడిచేశారని ధ్వజమెత్తారు. మాజీ కార్పొరేటర్లు రాగిరెడ్డి బన్ని, నల్లబెల్లి సుజాత, కర్రి శైలజ, ఐ.శ్రీను, కొలగాని దుర్గాప్రసాద్, బాలాప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి తిరుమలశెట్టి లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.